రైతులకు అవగాహన కల్పించాలి

సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 21: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ అనుబంధ పథకాలపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించి ఈ పథకాలను అర్హులందరికీ వర్తించేలా కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ శాఖల్లో రైతులకు వివిధ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని, వీటి గురించి రైతులకు వివరించి అందరికీ అందేలా చూడాలన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఏవో నాగరాజురెడ్డి, ఏడు మండలాల ఏవో, ఏఈవోలు, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం పలువురు వ్యవసాయ అధికారులను మంత్రి సన్మానించారు.

'మేర మల్లేశం' పుస్తకావిష్కరణ

హుస్నాబాద్, ఆగస్టు 21: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు 'మేర మల్లేశం స్వీయ చరిత్ర, పోరాట పాటలు' పుస్తకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. డాక్టర్ కె ముత్యం సంపాదకుడిగా, అన్నవరం దేవేందర్ రాసిన మేర మల్లేశం పుస్తకం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో దోహదపడుతుందని, సాయుధ పోరాట సమయంలోని పరిస్థితులకు అద్దం పట్టేలా పుస్తకం ఉన్నదని మంత్రి పొన్నం కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ హౌజ్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, నాయకులు అక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌సరఫరాకు అంతరాయం కల్గిస్తే..

వర్గల్,ఆగష్టు21: వ్యవసాయరంగానికి నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా విద్యుత్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ వర్గల్ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి గౌరారం రాజీవ్‌రహదారిపై గల 7హిల్స్ హోటల్ (స్పెషల్ బిర్యాణి పాయింట్) ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం అక్కడున్న రైతులతో మాట్లాడారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠినచర్యలుంటాయని హెచ్చరించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

అభాసుపాలవుతున్న అమ్మ ఆదర్శ కమిటీలు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 21 : ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యజమాన్య కమిటీల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీలు అభాసుపాలవుతున్నాయి. మహిళా సంఘాలకు పాఠశాలల నిర్వహణ బాధ్యతను అప్పగించడంతో మహిళా సంఘాల మధ్య ఆధిపత్యపోరు ఏర్పడుతున్నది. మహిళా సంఘాల మధ్య గొడవలతో పాఠశాలల నిర్వహణను అమ్మ ఆదర్శ కమిటీలు గాలికి వదిలివేస్తున్నాయి. దీనికి మద్దూరు మండలంలోని వల్లంపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న ఓ వ్యవహారాన్ని చక్కని ఉదాహరణగా చెప్పవచ్చు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం వంటలు వండే మహిళలను వద్దని చెప్పిన అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయకపోవడంతో మంగళవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందలేదు, ఈ విషయంపై 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో 'వల్లంపట్ల పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్' అనే కథనాన్ని ప్రచురించడంతో మండల నోడల్ ఆఫీసర్ వరదరాజు పాఠశాలను సందర్శించి, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడగా సానుకూలంగా స్పందన రాలేదు. దీంతో చేసేదేమిలేక తోటి ఉపాధ్యాయుల సహకారంతో హెచ్ ఎం ఫాతిమారాణి వంటలు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. అమ్మ ఆదర్శ కమిటీ వైఖరిపై గ్రామంలోని యువకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాఠశాలలో రాజకీయాలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని, ఇప్పటికైనా వారి తీరు మార్చుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని లేకపోతే తప్పుకోవాలని యువకులు హెచ్చరించారు.

పాఠశాలలో వంట వండుతున్న హెచ్ఎం ఫాతిమారాణి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 21 : కొండపాక మండలంలోని బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా, మర్పడగ, కొనాయిపల్లి గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు బుధవారం రైతుబంధు సమితి మాజీ మండల కో-ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కొండపాక మండల కేంద్రానికి చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందగా, మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అంబటి బాలచందర్ అందజేశారు.

చెక్కులు అందజేస్తున్న కో-ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలి

సిద్దిపేట టౌన్,ఆగస్టు 21 : నిరుపేదలు ఉచిత న్యాయసేవలను వినియోగించుకోవాలని సిద్దిపేట ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే పురస్కరించుకోని సిద్దిపేట ఎన్జీవ్వో భవన్‌ల్లో బుధవారం రాత్రి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. సందేహాలకు న్యాయపరమైన సలహాలను ఇచ్చారు. సీనియర్ సిటిజన్స్ అంజయ్య,సత్యనారాయణ, బాలేశం, చంద్రరెడ్డి, శ్రీకర్‌రెడ్డి, వెంకటేశం, న్యాయ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగసంస్థ) Syndicate

పాలమాకుల (13404) శాఖ, మెయిన్ రోడ్, పాలమాకుల-502 375.

స్వాధీనతా ప్రకటన {సెక్షన్ 13(4)}
(స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) (ఇకమీదట సదరు చట్టంగా రిఫర్‌చేయబడును) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తం **రూ. 23,66,011.92 (ఇరవై మూడు లక్షల అరవై ఆరు వేల పదకొండు రూపాయల తొంబై రెండు పైసలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత: **శ్రీమతి రేకులపల్లి భాగ్యమ్మ, భర్త: మహేందర్‌రెడ్డి,** ఇం.నెం. 1-43, వెంకటాపూర్, నంగనూర్ మండలం, సిద్దిపేట-502 375 వారిని కోరుతూ **28-05-2024** తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేసినారు.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడంచేత సదరు రూల్స్‌లోని రూల్ 8 మరియు 9తో చదువబడు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **17 ఆగస్టు, 2024**న స్వాధీనం చేసుకోవడం జరిగిందని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరుపు ఏదేని లావాదేవీలు **రూ. 23,66,011.92** మరియు దానిపై వడ్డీ కలిపి సదరు మొత్తం కొరకు కెనరా బ్యాంక్ చార్జ్‌కు లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ 8లోని నిబంధనలు గమనించవలసిందిగా రుణగ్రహీతకు తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరణ

మాతో ఎగ్జిక్యూట్ చేయబడిన డీడ్ నెం.8441/2017 తేది: 15-12-2017, వెంకటాపూర్ రెవెన్యూ గ్రామం వద్దగల 151.00 చ.గజాల విస్తీర్ణం, కూలగొట్టిన ఇంటి నెం. 1-43 యావత్తు, **సరిహద్దులు: తూర్పు:** ఆర్.నర్సింహ రెడ్డి ఖాళీ ప్రదేశం, **పడమర:** 40' వెడల్పు రోడ్, **ఉత్తరం:** కె.యాదగిరి రెడ్డి ఇల్లు, **దక్షిణం:** 30' వెడల్పు రోడ్.

తేది: 17-08-2024,
ప్రదేశం: పాలమాకుల.

సం/- అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలి

కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 21: మాదకద్రవాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన మాదకద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ జిల్లాలో ఈ యేడు ఇప్పటి వరకు 28 గంజాయి కేసులను నమోదు చేశామన్నారు. సిద్దిపేట వన్‌టౌన్, గజ్వేల్, ములుగు, గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదవుతున్నాయన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీల ద్వారా రెండు, మూడు కిలోల స్థాయిల్లో గంజాయిని తీసుకువచ్చి ఇక్కడి లేబర్లకు ఇస్తున్నారన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలో గంజాయి, మత్తు పదార్థాలు కలిపిన బిస్కెట్లు, నల్లబెల్లం అక్కడక్కడ కనిపిస్తున్నాయన్నారు. సిద్దిపేట పట్టణంలో ఒక ఆర్ఎంపీ డాక్టర్ పెయిన్ కిల్లర్‌లో మాదకద్రవ్యాలు కలిపి పేషెంట్లను మాదకద్రవ్యాలకు బానిసలను చేస్తున్నట్లు అనుమానంగా ఉందని డ్రగ్స్ నిర్మూలనలో సంబంధిత శాఖల సహకారం అవసరమన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల ప్రభావానికి జిల్లా ప్రజలు దూరంగా ఉండేలా పోలీస్, విద్యా, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, వ్యవసాయ, డ్రగ్స్ నియంత్రణ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో వెంటనే యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలని, మాదకద్రవ్యాలు సరఫరా కాకుండా నిఘా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, సిద్దిపేట, గజ్వేల్, ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, ఏసీపీ మధు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ

రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దు

సిద్దిపేటలో

దౌల్తాబాద్ మండల ఏపీజీవీబీ బ్యాంక్‌లో అకౌంట్ బుక్కులు క్యూలైన్లో ఉంచిన రైతులు

గజ్వేల్, ఆగస్టు 21 : రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని ఏడీఏ బాబునాయక్ అన్నారు. బుధవారం కార్యాలయంలో రైతుల నుంచి విజ్ఞప్తులను తీసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నోడల్ అధికారులకు తమ విజ్ఞప్తులను అందజేయలన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగలేదన్నారు. వెంటనే మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కేంద్రాల్లో గజ్వేల్ ఏవో నాగరాజు, కొండపాక ఏవో శివరామకృష్ణ, కుకునూర్‌పల్లి ఏవో గోవిందరాజు, రాయపోల్ ప్రద్యుమ్నులను రైతులు కలవాలన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్, ఆగస్టు 21 : రుణమాఫీ కానీ రైతులు ఆందోళనలు చెందొద్దని ఏవో వసంతరావు అన్నారు. బుధవారం ఆయన గొల్లపల్లి రైతువేదికలో రైతులతో మాట్లాడారు. రైతువేదికలో ఫిర్యాదుల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, ఆగస్టు 21 : సిద్దిపేటలోని ఎస్బీఐ, ఎడీబీ బ్యాంక్‌కు రైతుల రుణమాఫీ కాని వారు తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో తెలుసుకునేందుకు భారీ ఎత్తున వచ్చారు. దీంతో బ్యాంక్ రైతులతో కిక్కిరిసి పోయింది.

రాయపోల్‌లో..

రాయపోల్, అగస్టు 22 : రైతులకు ప్రభుత్వం విడుదల చేసిన రైతు రుణమాఫీ ప్రక్రియ దౌల్తాబాద్,రాయపోల్ మండలాలలోని ఆయా గ్రామాల్లో ఉన్న బ్యాంక్‌ల వద్ద ప్రతి రోజు రైతులు తిండి తిప్పలు లేకుండా పడిగాపులు కాస్తున్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ఏపీజీవీబీ బ్యాంక్‌లో రుణామఫీ నిధులను డ్రా చేసుకోవడానికి రైతులు బారి సంఖ్యలో రావడంతో వారి బ్యాంక్ అకౌంట్ బుక్కులను క్యూలైన్‌లో పెట్టాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు పేర్కొన్నారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న టీపీటీఎఫ్ ఉపాధ్యాయులు

గజ్వేల్, ఆగస్టు 21: గజ్వేల్‌లో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో లైగింకదాడిలో మృతి చెందిన కోల్‌కత జూనియర్ వైద్యురాలికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రం మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం బాధ్యులు రాజులు, నరేందర్, రాజయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

కులం కట్టుబాటుతో అంత్యక్రియలకు దూరం

దుబ్బాక, ఆగస్టు 21 : బొప్పాపూర్‌లో ఓ మృతుడి అంత్యక్రియలకు కుల బహిష్కరణ చేశారు. దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్‌లో బండమీది సాయి లు (71) మంగళవారం మృతి చెందాడు. వీరిది ఎస్సీ మాదిగ కులం. గ్రామంలో కొన్నేండ్లుగా నెలకొన్న భూ తగదా విషయంలో బండమీది సాయిలుతో పాటు అతడి అన్న మల్లయ్యను కుల పెద్దలు తమ కులం నుంచి బహిష్కరించారు. అప్పటి నుంచి వీరికి కులస్తులు దూరంగా ఉంటున్నారు. గత ఐదేండ్లు (2019-24) బండమీది మల్లయ్య భార్య బాలమణి బొప్పాపూర్ గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. ఆ సమయంలో కుల పెద్దలతో కలిసేందుకు సర్పంచ్ బాలమణి దంపతులు పలు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో మంగళవారం బండమీది సాయిలు మృతి చెందాడు. ఈ విషయంపై మృతుడి బంధువులు గ్రామంలోని కుల పెద్దలను కలిసి , ఆపద సమయంలో కలిసి రావాలని విన్నవించినా వారు పట్టించుకోలేదు. బుధవారం మధ్యాహ్నం వరకు మృతు డి కుటుంబీకులు, బంధువులు తమ కులస్తులు వస్తారని ఎదు రు చూశారు. అయినా కులస్తులు ఆ ఇంటి ముఖం చూడలేదు. అంత్యక్రియలకైన పాల్గొని, సహకరించాలని మృతుడి సోదరుడు మల్లయ్య కుల పెద్దలను వేడుకున్నా పట్టించుకోలేదు. కనీసం అంత్యక్రియల సమయంలో కనీసం (తమ కుల వృత్తి)డప్పులు కొట్టేందుకు రావాలని కోరినా స్పందించలేరు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు గ్రామాన్ని సందర్శించి, కుల పెద్దలతో చర్చించినా ఫలితం లేకపోయింది. చేసేదేమిలేక దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ నుంచి డప్పులు కొట్టేవారిని తెప్పించుకుని అంత్యక్రియలు నిర్వహించారు. కనీసం మానవత్వం చూపలేని కుల పెద్దల వైఖరిపై మండిపడ్డారు. తమకు జరిగిన అవమానం మరెవరికి జరుగకూడదని, ఈ విషయంపై త్వరలోనే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మృతుడి సోదరుడు మల్లయ్య విలేకరులతో తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్వగ్రామం లో కావడం విశేషం.

మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబీకులు

కిడ్నాపైన యువతిని కాపాడిన పోలీసులు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 21: కిడ్నాపైన ఓ యువతి డయల్ 100కు కాల్ చేయగా, మద్దూరు పోలీసులు వెంటనే స్పందించి, ఆ యువతిని కాపాడిన సంఘటన మద్దూరు మండలంలోని జెల్లగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. చేర్యాల సీఐ ఎల్ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ములు గు జిల్లా గుగుల్లపల్లి గ్రామానికి చెందిన తీగల రాజశేఖర్‌రెడ్డి, హన్మకొండ జిల్లా ఎర్రబెల్లి గ్రామానికి చెందిన నాలీబాల శిరీష హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. మంగళవారం రాజశేఖర్‌రెడ్డి శిరీషకు మాయమాట లు చెప్పి, భయభ్రాంతులకు గురిచేసి ఆమె ను కిడ్నాపు చేసి అతడి స్నేహితుడి గ్రామమైన ధూళిమిట్ట మండలంలోని జెల్లగూడెంకు తీసుకువచ్చాడు. రాజశేఖర్‌రెడ్డి ప్రవర్తనలో మార్పు గమనించిన శిరీష బుధవారం ఉదయం 7 గంటలకు డయల్ 100కు కాల్ చేసి తనను కిడ్నాప్ చేశారని చెప్పగా, మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్, ఏఎస్సై జగదీశ్వర్ హుటాహుటిన జెల్లగూడెంకు వెళ్లి ఇరువురిని మద్దూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి విచారణ చేపట్టారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదు కాగా, శిరీషను కూకట్‌పల్లి పోలీసులకు అప్పజెప్పారు. డయల్100కు త్వరగా స్పందించి కిడ్నాపర్ నుంచి యువతిని కాపాడిన మద్దూరు ఎస్సై, ఏఎస్సైని సీపీ అనురాధ ప్రత్యేకంగా అభినందించారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 21: హుస్నాబాద్ మున్సిపల్‌కార్మికులకు వేతనాలు చెల్లించాలని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వవేణుగోపాల్‌రెడ్డి కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించని పక్షంలో ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

మైనంపల్లివి చిల్లర రాజకీయాలు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

సిద్దిపేట,ఆగస్టు 21 : మంత్రి పదవి కోసం మైనంపల్లి హన్మంతరావు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు కెమ్మసారం ప్రవీణ్, కలకుంట్ల మల్లి కార్జున్, సద్ది నాగరాజురెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని గణేశ్ నగర్‌లో మాట్లాడుతూ సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీని సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తరలించుక పోతే ప్రశ్నించలేని మైనంపల్లికి మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే అర్హత లేదన్నారు. సిద్దిపేటకు వచ్చి చిల్లర రాజకీయలు చేసి సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ దృష్టిలో పడాలనే తాపత్రయం మాత్రమే అన్నారు. ప్రశాంతంగా ఉన్న సిద్దిపేటలో చిచ్చు పెట్టేందుకు రావద్దన్నారు. మల్కాజిగిరిలో చెల్లని రూపాయి సిద్దిపేటలో చెల్లుతుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తి ఆయిన క్యాంప్ ఆఫీసును ధ్వంసం చేసిన వారికి మైనంపల్లి వత్తాసు పలుకుతున్నాడన్నారు. సిద్దిపేటకు మైనంపల్లి ఆభివృద్ధి నిధులు తీసుకురావాలన్నారు. చిల్లర పనులు ఆపకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

రాజకీయ ఉనికి కోసమే..

మిరుదొడ్డి, ఆగస్టు 21 : రాజకీయ ఉనికి కొరకే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు పడరాని పాట్లు పడుతున్నారని మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు అన్నారు. బుధవారం మిరుదొడ్డిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని సిద్దిపేటను రాష్ట్రంలోనే వివిధ రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన నాయకుడు ఎమ్మెల్యే హరీశ్‌రావు అంటూ పేర్కొన్నారు. హరీశ్‌రావు పై విష ప్రచారం చేస్తే ప్రజలు తిరగబడుతారని హెచ్చరించారు. ఏ హోదాతో నీవు ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శిస్తున్నావని మండి పడ్డారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

వర్గల్, ఆగస్టు 21 : గర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గౌరారం రాజీవ్ రహదారిపై చోటుచేసుకుంది. గౌరారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్‌కు చెందిన చిక్కుడు కిరణ్ (30) మరో నలుగురితో కలిసి గౌరారం వద్దగల సెవన్‌హిల్స్ హోటల్ వద్ద ఫ్లెక్సీ కట్టేందుకు వచ్చారు. ఇందులో భాగంగా కిరణ్, ఇంకో అతను ఫ్లెక్సీలను పట్టుకొని రోడ్డు పక్కనుంచి వెళ్తుండగా వెనుకనుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం కిరణ్‌ను బలంగా ఢీకొట్టడంతో కిరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతు డి తండ్రి చిక్కుడు నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తుట్లు ఎస్సై తెలిపారు.

ఎల్ ఆర్ఎస్‌పై క్షేత్రస్థాయిలో అధికారుల విచారణ

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 21: ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేందుకు అధికారులు నడుంబిగించారు. హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు దాదాపు 5,488 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు చేసుకున్న భూములు ఎక్కడ ఉన్నాయనే విషయంపై క్షేత్రస్థాయిలో అధికారులు బుధవారం విచారణ జరిపారు. పట్టణంలోని 5,6,10వ వార్డుల్లో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు చేసుకున్న వారిభూములను పరిశీలించారు. దరఖాస్తుదారులకు సంబంధించిన భూమిపత్రాలు, స్థలం, ఈసీతోపాటు పలు పత్రాల ను అధికారులు పరిశీలించారు. ఈ విచారణలో మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్, రెవెన్యూ ఆర్ఐ హరీశ్, ఇరిగేషన్‌శాఖకు చెందిన అమృతయ్య, మునిసిపల్‌కు చెందిన శివకుమార్, అరవింద్, శ్రీకాంత్‌తోపాటు పలువురు ఇందులో ఉన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్

భారత్ బంద్ ప్రశాంతం

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల,మాల ఉపకులాలు సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన భారత్ బంద్ బుధవారం సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. నాయకులు వివిధ బస్సు డిపో ఎదుట బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ముందస్తుగా విద్యాసంస్థలకు సెలవులను ప్రకటించారు. దుకాణాదారులు తమ దుకాణ సముదాయాలను తీయలేదు. అత్యవసర సేవలు మినహా మిగతవన్నీ బంద్ పాటించాయి. మాల మాల ఉపకులాల ఐక్యవేదిక నాయకులు ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

-సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, ఆగస్టు 21

హుస్నాబాద్: అంబేద్కర్ చౌరస్తాలో వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న నాయకులు

ధూళిమిట్టలో నినాదాలు చేస్తున్న మాలమహానాడు నాయకులు

మున్నూరు కాపుల కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలి

సిద్దిపేట టౌన్, ఆగస్టు 21 : మున్నూరు కాపుల కార్పొరేషన్‌కు ప్రభుత్వం తక్షణమే నిధులను మంజూరు చేయాలని సిద్దిపేట జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు నాయకం మల్లయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం సిద్దిపేట మున్నూరు కాపు సంక్షేమ భవనంలో బుధవారం సంఘ నేతలు కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మౌన పోరాట దీక్ష చేశారు. పట్టణ అధ్యక్